ఛార్జ్ షీట్

కప్పగంతు సుబ్రహ్మణ్యం



అప్పుడే ఉదయభానుడు తూర్పు కొండలు దాటి తన దినచర్యకి పురోగమిస్తున్నాడు. మబ్బులుకూడా లేని ఆ విశాల ఆకాశంలాగే తన చుట్టూ నిర్మానుష్యంగా వున్న మైదానాలు, తూగుపు కొండల్నీ చూస్తూ ప్రకృతికి నమస్కరించాడు, అప్పుడే తన డ్యూటీకి వచ్చిన రామారావ్.

రామారావ్ కొద్ది నెల్ల క్రితమే ఆ మారు మూలనున్న సత్యాపురం స్టేషన్‌కు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా వచ్చాడు.

సత్యాపురం ఊరికి ఐదు మైళ్ళ దూరంలో ఏర్పాటు చేయబడ్డ అతిచిన్న క్రాసింగ్ స్టేషన్. రోజూ ఆగే రెండు ప్యాసింజర్ రైళ్ళు తప్ప మరే విధమైన జనసంచారం కనబడని ఆ ఎడారిలో అప్పుడప్పుడు గూడ్సు రైళ్ళు కొన్ని ఆగినా అవి అక్కడనుండి ఎప్పుడు పరిగెడదామా అన్నట్లు చప్పుడు చేస్తూ చుట్టుపక్కల ఉండే పశువుల

హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తెలుగు సమితి (బెంగుళూరు) దశమ వార్షికోత్సవాల సందర్భంగా సమితి తరఫున డా. దాశరథి, డాక్టర్ సి. నారాయణరెడ్డిగార్లని సన్మానిస్తున్న హెచ్. ఏ. ఎల్. ఛైర్మన్ కాప్టెన్ బి. కె. కపూర్, కర్నాటక విద్యుత్ శాఖా మాత్యులు శ్రీ బి. అశ్వత్థరెడ్డిగార్లని చిత్రంలో చూడవచ్చు.

కాసరులని మాత్రం బాగా ఆకట్టుకుంటాయి. ఒక్క మాటలో వ్రాయాలంటే ఆ స్టేషన్ నిర్మానుష్యానికి, దేశంలో అభివృద్ధి చెంద వలసిన ప్రాంతాలు చాలా ఉన్నాయి సుమీ! అని చాటిచెప్పే దర్పణమే.

స్వతహాగా మొహమాటస్థుడయిన రామారావ్ కొత్తలో కొంత ఇబ్బంది పడ్డా క్రమక్రమంగా ఆ ఒంటరితనానికీ, ఎడారి వాతావరణానికి అలవాటుపడ్డాడు బాగా. రోజూ తన డ్యూటీ అవగానే తన క్కేటాయిం చిన యింట్లో స్వయంపాకం చేసుకోవడం, అసంపూర్తిగా వదిలేసిన తన చదువును కొనసాగిద్దామా, వద్దా అన్న ఆలోచనా ముసుగులో నిద్రపోవడం రామారావ్ నిత్యకృత్యం.

ఆ రోజు...

ప్రొద్దున్నే వెళ్ళవలసిన ప్యాసింజర్ బండి పొగ వదుల్తూ దూరాన్ని ఎంత త్వరగా మింగేద్దామా అన్న కోపంతో స్టేషన్ నుండి దూరంగా పరిగెడుతూంది.

రామారావ్ టిక్కట్ల బీరువా తాళాయి వేసి కూర్చుంటూ పోర్టర్ని;

"సోములూ... సోములూ..." అంటూ కేకేసాడు.

"సార్ ..." అంటూ లోపలకు సోములు

ఛార్జ్ షీట్

రాగానే రామారావ్,

"నైన్ అప్ ఎక్స్‌ప్రెస్ ఇంకా పోలేదు కదరా! సోములూ; ఇంకో అరగంటలో రావచ్చు. దూరం ఎక్కడికీ పోకండి ..." అని ఒకసారి హెచ్చరించాడు.

"అలాగే సార్! ఒక ఐదు నిముషాల్లో చాయ్ తాగి వచ్చేం" అని సోములు బైటకు ఉడాయించాడు.

ఆ స్టేషన్ వద్ద ఎడారిలో ఒయాసిస్‌లా 'వాయర్ టీ స్టాల్' ఒక్కటే వాళ్ళందరికీ కాలం గడిపే స్థలం. ఏ మాత్రం టైమ్ దొరికినా పోర్టర్లూ, క్యాబిన్‌మెన్లూ అక్కడే జేరి కాలం గడుపుతూ, మళ్ళీ రైలు వచ్చే టైమ్‌కి మాస్టర్ ఇచ్చే పిలుపు కోసం ఎదురు చూడడం పరిపాటే.

పొద్దున్నే లేవగానే కాఫీ కడుపులో పడకపోతే రామారావ్‌కి అడుగు ముందుకి పడదు. పాలు ఆ టైమ్‌లో దొరకవు కాబట్టే తయారుగా పాలపొడి డబ్బా అతని కాఫీ అవసరం తీరుస్తూ ఉంటుంది.

పక్క స్టేషన్ నుండి 'బెల్' రావడంతో, చదువుతున్న పాతపేపరు పక్కన పెట్టి రామారావ్ అట్నుంచి రాబోయే గూడ్సు రైలుకు "లైన్ క్లియర్" ఇచ్చాడు.

బైట వాయర్ స్టాల్‌వైపు చూసి –

"సోములూ ... సోములూ...!" అంటూ పిలిచి, చేయి ఊపాడు.

సోములూ; మిగతా రైల్వే పనివాళ్ళు హడావుడిగా వాళ్ళ వాళ్ళ స్థానాలకు జేరు కున్నారు.

"గూడ్సు బండి 'బ్లాక్' అయింది. బహుశా ఇక్కడే నైన్ అప్‌కి క్రాసింగ్ ఉండొచ్చు" అని సోములుకి, మిగతావాళ్ళకి చెప్పి ఇటు తిరిగేలోగా రెండవవైపు స్టేషన్ నుంచి –

"రామారావ్! నైన్ అప్ బ్లాక యిందోయ్...!" అని ఆ స్టేషన్ మాస్టర్ చెప్పాడు.

గూడ్సుబండి పక్క స్టేషన్ వదలిన సంకేతం గినుకొని; రామారావ్ తన స్టేషన్ వాళ్ళకి 'క్రాసింగ్' ఉంటుందని, 'గూడ్సు'కి 'సిగ్నల్' ఇమ్మన్నాడు. తను ఎక్స్‌ప్రెస్‌కి లైన్ క్లియర్ ఇచ్చాడు.

మరో పది నిమిషాల్లో ఎక్స్‌ప్రెస్ కూడా అవతల స్టేషన్ వదిలినట్లు తెల్సింది.

రామారావ్ స్టేషన్ బైటకి చూశాడు. కనుచూపు మేరలో గూడ్సు వస్తూన్న జాడ లేదు.

అప్పటికే ఇరవై నిమిషాలు దాటింది, అది ఆ స్టేషన్ వదిలి.

ఇవతలనుండి ఎక్స్‌ప్రెస్ ఇంజన్ విజిల్ బాగా దగ్గరలో వినబడుతోంది.

ఆ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ ఆగదు. కానీ ఈ రోజు ఈ గూడ్సు క్రాసింగ్‌వల్ల అది తప్పనిసరిగా ఆగవలసివస్తోంది. రామారావ్ మరి కాసేపు వేచి ఇంక 'గూడ్సు' అయిపులేక దానికిచ్చిన సిగ్నల్ కాన్సిల్ చేయమని 'కాబిన్'కి చెప్పి ఎక్స్‌ప్రెస్ లోపలికి రావడాన్కి అనుమతించాడు.

ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లో నిలిచి పది నిమిషాలు దాటింది. రోజూ పొద్దున్న ఆరు గంటలకే వెళ్ళిపోయే ఆ బండి ఈ రోజు రెండు గంటల ఆలస్యం కావడంతో, ఈ గూడ్సు బండి క్రాసింగ్‌కి రాకపోవడంవల్ల, సత్యాపురం స్టేషన్‌కి ఆ క్షణంలో 'పండగ' కళ వచ్చింది; దిగిన ప్రయాణీకుల హడావుడితో.

అసలే ప్రయాణం; దాంతో బండి లేటవడం. వీటికో చిరాకుగా ఉన్న ప్రయా

ణీకులు, బ్రష్‌లు, ఫ్లాస్క్‌లు, లోటాలూ పట్టుకుని స్టేషన్ చుట్టుముట్టారు.

మరో గుంపు నాయర్ టీ స్టాల్ వైపు పరుగులీశారు. తన ఆఫీస్‌లో జేరిన ప్రయాణీకుల గుంపుకు సావధానంగా రామారావ్ "మీకు టీ, సిగరెట్లూ వగైరా ఆ ఎదురుగా ఉన్న షాప్‌లో దొరుకుతాయి. మీ బండి ఇంకొద్ది సేపట్లో ఇక్కడనుండి బయల్దేరుతుందని..." సర్దిచెప్పి ఇటువైపునుండి వచ్చే గూడ్సు గురించి ఆలోచనలో పడ్డాడు.

అప్పటికీ గూడ్సుబండి జాడలేదు. పక్క స్టేషన్ నుండి చల్లగా తెల్సింది అరగంట తర్వాత – ఆ గూడ్సు మధ్యలోనే ఆగిందనీ; కొద్ది సేపట్లో ఆ స్టేషన్ చేరవచ్చనీ.

చుట్టుపక్కల మరో దుకాణం పేరుకైనా లేదేమో, నాయర్ టీ స్టాల్‌లోని సరుకంతా అమ్ముడయిపోయింది. నిరాశపడ్డ ప్రయాణీకుల్లో సతీష్ ఒకడు. అతను ఖాళీ ఫ్లాస్క్ తీసుకుని స్లీపర్‌లో ఉన్న భార్య రాణిని ఉద్దేశించి –

"ఎక్కడా పాలు దొరకలేదు రాణీ! పాపని ఎలాగైనా కాసేపు ఊరడించు" అన్నాడు.

అప్పటికే పాప గోలతో విసిగిపోయిన రాణి – "మీరే ఊరుకోబెట్టండి మీ అమ్మాయిని" అంటూ సతీష్‌కి అందించింది.

పాపను భుజంమీద సముదాయిస్తూ మళ్ళీ ఫ్లాస్క్‌తో స్టేషన్‌లో అడుగుపెట్టాడు సతీష్. రామారావ్ చుట్టూ ఉన్న ప్రయాణీకుల నుద్దేశించి –

"ఇంకో ఇరవై నిముషాల్లో బండి బయల్దేరుతుంది. మీరంతా మాతో సహకరించి మీ మీ స్థానాలకు చేరుకోండి" అన్న విన్నపం సతీష్ చెవుల్లో కూడా పడింది.

రామారావ్ తన చుట్టూ వున్న వాళ్ళందరూ మెల్లగా దూరమవుతున్నా వెనక్కి తిరగని సతీష్‌వైపు ప్రశ్నార్థకంగా దృష్టిసారించాడు.

"మా అమ్మాయి పాలకోసం చాలా యిబ్బంది పెడ్తోంది. ఈ చుట్టు పక్కల ఎక్కడైనా ఒకగ్లాసు పాలు దొరుకుతాయేమో అని చూస్తున్నాను. మీరే కొంచెం సహాయం చేయాలి" అన్నాడు సతీష్.

రామారావ్ బైటకు చూసి నాయర్ స్టాల్ మూసి ఉండడం గమనించాడు. అది గ్రహించిన సతీష్,

"నేను అక్కడ నుండే యిటు వస్తున్నా! ఒక్క గ్లాస్ పాలు మీరు ఎక్కడనుండైనా తెప్పించండి ... ప్లీజ్ ..." అంటూ రెండు రూపాయల నోటు, ఫ్లాస్క్ రామారావ్ వైపుంచాడు.

రామారావ్, "ఆ నోటు లోపలపెట్టండి. ఇక్కడ యీ టైమ్‌లో పాలు అసలు రావు. అయినా, ఇంకో పావుగంటలో మీ బండి బయల్దేరుతుంది. కొంచెం ఓపిక పట్టండి" అని సతీష్‌తో అన్నాడు.

రామారావ్ పైకి అలా అన్నా తనకీ తెల్సు ఆ బండి అక్కడనుండి ఇంకో అరగంట వరకూ కదల్దనీ; అలా బయల్దేరినా ఆ పాప ఆకలి తీరడానికి ఇంకో గంటదాకా ఆగాలనీ.

సతీష్ నిరాశా, బాధ అర్థం చేసుకొన్నాడు. కాబట్టి ఎలా అయినా అతనికి సహాయపడాలని పించింది రామారావ్‌కి. అప్పుడు ఊహకి అందింది తన యింట్లో వున్న పాలపొడి డబ్బా. వెంటనే రామారావ్ –

"సోములూ !..." అంటూ పిల్చాడు.

సోములు "గూడ్సుబండి పోయిందా, సార్; లైన్ క్లియరయిందా...? గంట కొట్టేయమంటారా...?" అని ప్రశ్నల వర్షం కుర్పించాడు.

"కాదురా ! ఆ బండి ఇంకా అక్కడకి జేరలేదుకానీ, బైట మీ తమ్ముడున్నాడా ? ఉంటే వాడ్నిటు పిలు" అన్నాడు రామారావ్ తన యింటి తాళంచెవులు జేబులోంచి తీస్తూ !

"ఏంది మాష్టారూ !..." అంటూ లోపలకు వచ్చిన సోములు తమ్ముడికి తాళం చెవులిచ్చి, తన యింట్లో ఉన్న పాలడబ్బా ఎక్కడుందో చెప్పి తీసుకురమ్మన్నాడు త్వరగా.

యిక్కడ సోముల్ని ట్రైన్ యింజన్ వద్దకి పంపి తన కెటిల్‌నిండా వేడినీళ్ళు తెప్పించాడు రామారావ్.

పాలపొడి డబ్బా, వేడినీళ్ళ కెటిల్ సోముల్ని తీసుకుని సతీష్‌తో పంపి; త్వరగా తిరిగి రమ్మన్నాడు.

రాణికి అవి అందించి సతీష్ త్వరగా పాలు కలపమని చెప్పబోతూంటే సోములు తిరిగి



ఛార్జ్ షీట్

రామారావ్ పిలుపు విని వెనక్కి పరిగెత్తాడు.

రామారావ్ అందించిన 'లైన్ క్లియర్' తీసుకువెళ్తున్న సోముల్ని చూసి సతీష్ వేణ్ణీళ్ళు ఫ్లాస్క్‌లో నింపి, పాలపొడి కొంచెం గ్లాస్‌లో వేసి అవి రామారావ్‌కి అప్పజెప్పడానికి వచ్చాడు.

''మీరు మళ్ళీ యిలా వచ్చారు; మీ బండి కదలబోతోంది'' అన్నాడు రామారావ్.

సతీష్ ఆ పాలడబ్బా, కెటిల్ రామారావ్‌కి ఇచ్చేసి తన కృతజ్ఞతలు మాటల్లో వ్యక్తపరుద్దామని —

''మీ పేరు చెప్పారు కాదు'' అన్నాడు.

''మీ బండి కదిలిపోతోంది మీరు ముందెక్కండి. నా పేరుదేముందిలెండి'' అంటూ రామారావ్ స్టేషన్ లోపలకువెళ్ళాడు ఫోన్ అటెండ్ అవడానికి.

గార్డ్ చూపే పచ్చజండా చూస్తూ కదలుతున్న ఆ బండి ఎక్కాడు సతీష్ ఆ స్టేషన్ పేరూ, ఆ మాస్టర్ రూపం మనస్సులోనే తలచుకొంటూ.

బెర్త్ మీద పాప ప్రశాంతంగా పాలు తాగుతూ నిద్రకుపక్రమించింది.

సతీష్ తన ఊరు చేరినా ఆ స్టేషన్ మాస్టర్ చేసిన సహాయానికి ఏ విధంగా కృతజ్ఞత తెలియజేస్తే బాగుంటుంది! అని ఆలోచించాడు.

అప్పుడు గుర్తుకు వచ్చిందతనికి, ప్రతి రైల్వేలోనూ ఒక సూచన — ఫిర్యాదుల విభాగం పని చేస్తోందనీ; వారికి రాస్తే తన అభినందనలు ఆఫీస్ ద్వారా ఆ స్టేషన్ మాస్టరు కందుతాయనీను.

వెంటనే లెటర్‌పాడ్ తీసుకుని త. ప్రయాణం వివరాలు; ఎడారిలాంటి ఆ స్టేషనూ; దాని పేరూ, బండి నెంబరూ, తేదీ రాస్తూ ఆ రైల్వే అధికారులకి —

''ఆ స్టేషన్ మాస్టర్ చేసిన సకా. సహాయానికి తన ధన్యవాదాలు స్వయంగా చెప్పడాన్కి అవకాశం కుదరలేదనీ, ఉత్తరం ద్వారా తెలియజేయడాన్కి ఆయన తన పేరు ఇవ్వనిరాకరించారనీ, అందుచే మీ ఆఫీస్ ద్వారా తన కృతజ్ఞతలు ఆ స్టేషన్ మాస్టర్‌కు అందజేయమనీ'' విన్నవించుకొన్నాడు తన లేఖలో.

సతీష్ ఉత్తరం ఆ రైల్వే ఆఫీస్‌లో సూచనలు—ఫిర్యాదుల కార్యాలయానికి చెందిన గుమాస్తాల చేతుల్లోనే పడింది. అందునా సీనియర్ క్లర్క్ సీతాపతికి చిక్కిందీ … అంటే ఇంక వేరే ఏముందీ … ?



సీతాపతికి ఆఫీస్‌కి వచ్చే ఉత్తరాల్లోని పదాల్లో ఎప్పుడూ ఏవో కొత్త అర్థాలు వెదికిపట్టడం మా గొప్ప సర్దా! అందులోనూ తన సహచరుల లోటుపాట్లను వెతకడం; మంచినికూడా మరో దృష్టితో చదవడం వెన్నతో పెట్టిన విద్య. చేతిలోని సతీష్ ఉత్తరంలో —

''ఆ స్టేషన్ మాస్టర్ తన పేరు ఇవ్వ నిరాకరించారని'' అన్నది మాత్రం మరో పుంజీడుసార్లు చదువుకొని సాపేక్షగా నవ్వుకొని, తన ప్రజ్ఞా పాటవాలు వెల్లడించడానికా అన్నట్లు —

''రైల్వే కాండక్ట్ రూల్స్ ప్రకారం ఎవరు, ఎప్పుడు అడిగినా రైల్వే ఉద్యోగి తన పేరు, ఉద్యోగం ఎల్లప్పుడూ తెలియజేయాలనీ; ఈ సత్యాపురం స్టేషన్ మాస్టర్ ఈ విషయంలో తన పేరు సతీష్‌గార్కి చెప్ప నిరాకరించాడనీ; అందు చేత కాండక్ట్ రూల్స్‌కు వ్యతిరేకంగా నడచినట్లయిందనీ, దానికి ఆ స్టేషన్ మాస్టర్‌ను ఛార్జ్‌షీట్ చేయవచ్చనీ…'' రిమార్క్ వ్రాసి,

తన పై అధికారికి ఆ లేఖ అందజేయడం ఆ అధికారి — ''ప్రొసీడ్'' — అని సంతకం చేయడం క్షణాలమీద జరిగాయి.

మరే విన్నపమో అయితే ఆ ఆఫీస్ నుంచి వచ్చే జవాబు కోసం చకోరంలా ఎదురు చూడవలసిందే. కానీ సతీష్ ఉత్తరం అదృష్టమా అన్నట్లు అతనికి, ఆ రైల్వే ఆఫీస్ నుండి —

''మీకు కల్గిన ఈ అసౌకర్యంకు చాలా చింతిస్తున్నాం. దీనికి కారకులైన వారిపై తగు చర్య తీసుకోబడుతుంది'' - అన్న జవాబు చూసిన సతీష్‌కు రైల్వేవాళ్ళ ప్రాంప్ట్ రిప్లైకి, సూక్ష్మబుద్ధికి, వ్యవహార దక్షతకూ నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు.

ఇక్కడ —

దాదాపు అదే పరిస్థితిలో ఉన్న రామారావ్ చేతిలో గాలికి రెపరెపలాడుతున్న ఆ 'ఛార్జ్‌షీట్'కి ఏ విధంగా జవాబివ్వాలా అని ఆలోచిస్తూ భారంగా నిట్టూర్చాడు!

… అవినీతికీ, ఆశ్రిత పక్షపాతానికీ ఆలవాలమైన పాలనా యంత్రాంగం లాంటి దట్టమైన కారుమబ్బులు దూరంగా కొండ మీద వెల్లివిరిసిన పచ్చదనాన్ని కబళించడానికి తరుముకొస్తున్నాయి. ★